ఆంధ్ర భూమి మాసపత్రిక 9.2001

# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

## దాహం

### మీనాక్షి శ్రీనివాస్

''డాక్టర్ బాబూ...డాక్టర్ బాబూ...నా బిడ్డను రక్షించు బాబూ...నా బిడ్డను రక్షించు బాబూ'' రొప్పుతూ గాబరాగా వస్తూ అన్నాడు గంగులు.

''హుష్...ఏమిటా గోల? ఏమయింది? ఆసుపత్రిలో అలా కేకలెయ్యకూడదు'' కాంపౌండర్ కసురుకున్నాడు.

''లేదు బాబూ...నా బిడ్డకేటో అయిందట. మా ఊళ్ళో డాక్టర్ బాబు చెప్పాడు. ఇంక కరుణాకరం బాబే రక్షించాల. అదేదో గుండె కాపరేషన్ సేత్తేతప్ప నా బిడ్డ నాకింక దక్క డట'' భయంగా అన్నాడు గంగులు.

''ఓహో...ఆ కేసా? ఇందాక భీమిలి నుండి ఆ డాక్టర్ ఫోన్ చేసి ఇక్కడికి మాట్లాడాడులే. నేను విన్నాను. అయినా ఆ ఆపరేషన్‌కు చాలా ఖర్చవుతుంది. అసలు ఈ డాక్టర్ బాబు ఫీజే మీరిచ్చుకోలేరు. అయినా నా మాట విని నీ బిడ్డని గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకొనిపో. నీ అదృష్టం వాడి అదృష్టం'' వెటకారంగా ఓ ఉచిత సలహా పారేశాడు.

''అట్టనమాకయ్యా. ముందు లోపలికి చేర్చుకుని ఆ కరుణాకరం బాబును ఓసారి చూడమను బాబూ. నా తల తాకట్టు పెట్టయినా ఆ డబ్బుతెత్తాను బాబూ'' గంగులు బ్రతిమిలాడుతూ.

''నీ తలెవ్వడు తాకట్టు పెట్టుకుంటాడు తలకు మాసినవాడు. ఊరికే నస పెట్టక ఆడిని పెద్దాసుపత్రికి తీసుకుఫో. ఇక్కడ గోల పెట్టకు. మరీ ఆలస్యంచేస్తే ఆడు ఇక్కడే గుటుక్కుమంటాడు.' అప్పుడు మా డాక్టర్ నామీద అరుస్తాడు'' కసురుకుంటూ కంగారు పెట్టాడు కాంపౌండర్.

''బాబ్బాబ్బా...నీ కాళ్ళు పట్టుకుంటాను. చచ్చి నీ కడుపున పుడతా. నాకున్న ఒక్కగానొక్క బిడ్డయ్యా. కనికరం చూపించండయ్యా...డాక్టర్ బాబును బతిమాలుకుంటాను. ముందు ఆస్పత్రిలో చేర్చుకోవయ్యా'' బావురుమన్నాడు గంగులు.

''ఏంటయ్యా నువ్వు చెప్పేది? అసలు డాక్టర్ బాబు నీలాటి వాళ్ళకేసి కూడా చూడడు. అసలు ఆయనే వుంటే ఇంతసేపు నిన్నిక్కడ నిలబడనిచ్చేవాడుకాదు. అదిగో డాక్టరుగారొస్తున్నారు. నువ్వు పోవయ్యా బాబూ'' అంటూ కంగారుపడ్డాడు ఆ కాంపౌండర్.

''రాజూ! ఏమిటీ న్యూసెన్స్. ఎవరు వీళ్ళు? ఏమిటి దంతా?'' కార్లోంచి దిగుతూనే విసుక్కున్నాడు డాక్టర్ కరుణాకర్.

''బాబూ...తమరే నా బిడ్డను రక్షించాల. మేం భీమిలీ నుంచి వచ్చాం బాబూ. నా బిడ్డకేదో గుండె జబ్బుట. మీరు చూత్తేనే ఆడు బతుకుతాడట బాబూ. బాబ్బాబూ నాకున్న ఒక్కగానొక్క బిడ్డ బాబూ. తమరే దయచూడాల'' దీనంగా వేడుకున్నాడు గంగులు.

''అరె...ఏమిటీ గోల. వదులు నా కాళ్ళు. చూడు మీ వూరి డాక్టర్ ఇందాక నాతో ఫోనులో మాట్లాడాడు. గుండె జబ్బు బాగా ముదిరిపోయింది. ఆపరేషన్





## కల

''తెల్లవారొచ్చిన కలలు నిజమౌతా యంటావా?'' ఆనందంతో అడిగాడు రామారావు ఫ్రెండ్ సూర్యారావుని.

''ఏం కలొచ్చింది?'' అడిగాడు సూర్యారావు.

''మా ఆవిడ వంట చేస్తున్నట్లు'' ఉత్సాహంగా చెప్పాడు రామారావు.

## నయం

ప్రియురాలి బర్త్‌డేకి బంగారు ఉంగరాన్ని ప్రెజెంట్ చేస్తూ స్వయంగా వేలికి తొడిగి ''ఎలా వుంది?'' అడిగాడు ప్రియుడు గర్వంగా.

''నీకంటే ఆ ప్రసాద్, రమేష్‌లే నయం. సంవత్సరానికి రెండు బర్త్‌డేలు జరుపుకున్నా డైమండ్ నెక్లెస్‌కి తక్కువ కాకుండా తెచ్చేవాళ్ళు'' అనేసి నాలుక్కరుచుకుంది.

## జిలేబీ

రాణి పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకుని తన్మయంగా అన్నాడు రాజు- ''అమృతం తాగినట్టు ఎంత తీయగా వున్నాయి నీ పెదాలు.''

''ఛీ...పో రాజూ! నేనిప్పుడే జిలేబీ తినొచ్చాను'' సిగ్గుపడుతూ చెప్పింది రాణి.

## చీర

''అమ్మా! నువ్వెప్పుడూ నాన్నని ఎప్పుడైనా ఓ చీర కొని తెచ్చారా అని అంటూ వుంటావుగా?'' అడిగాడు బాబీ.

''అవును ఏం?''

''నాన్న చీర తెచ్చారమ్మా.''

''నిజంగా! ఏదీ? ఎక్కడ పెట్టారు?'' ఆత్రంగా అడిగింది తల్లి.

''మొన్న నువ్వు సినిమాకి వెళ్లినప్పుడు నాన్న 'నీ కోసమే చీర కొని తెచ్చాను' అని పనిమనిషికి ఇచ్చేశాడుగా'' చల్లగా చెప్పాడు బాబీ.

-పి.లక్ష్మీదేవి (హన్మకొండ)

చేసినా గ్యారంటీలేదు. పైగా లక్షకుపైగా ఖర్చవుతుంది. అసలు ముందు ఆస్పత్రిలో చేర్చుకొందుకు, టెస్టులకు సుమారు పదిహేను వేలవుతుంది. నీ వల్లకాదుగానీ పొండి.''

''బాబ్బాబూ అట్లా అనకయ్యా. ముందు మీరు ఓపాలి చూడండయ్యా. తర్వాత నేను ఎట్టాగోలా డబ్బులు తెత్తాను'' బ్రతిమిలాడుకుంటూ.

''ఏమిటి తెచ్చేది ఉప్పుచేప. ఎవడిని పడితే వాడిని చేర్చుకుందుకు ఇదేమీ ధర్మాసుపత్రికాదు. లక్షలు ఖర్చు పెట్టి చదివినదీ, హాస్పిటల్ కట్టినదీ ఇలా దారినపోయే వాళ్ళందరికీ ఉచిత సేవ చేయడానికి కాదు. వెళ్ళు వెళ్ళు'' అసహనంగా కరుణాకర్ అన్నాడు.

''అయ్యా...అట్టా అనకయ్యా. కాసింత కనికరం చూపవయ్యా. అంతవరకూ నీ కాళ్ళు వదలను బాబూ...''

''అరె...ఏమిటీ న్యూసెన్స్. రాజూ...వాచ్‌మెన్‌ని పిలిచి వీళ్ళను బయటకు పంపించు. ఛ...ఛ రాను రాను జనానికి డీసెన్సీ వుండడంలేదు. అలగా జనం'' హుంకరిస్తూ అన్నాడు కరుణాకర్.

''మా పెద్ద డాక్టరువయ్యా. ఓ ప్రాణం కంటే నీకు డబ్బులు అంత ఎక్కువా? రేపు లక్షలు తెచ్చినా పోయిన ప్రాణం తేగలవా? పోతామయ్యా పెద్దాసుపత్రికే పోతాం. ఆడదృష్టం నా అదృష్టం బాగుంటే ఆడు బతుకుతాడు. లేకపోతే లేదు. పెద్ద మారాజులకు పెద్ద మనసుంటుందనుకోవడం మా తెలివితక్కువతనం'' నిస్సహాయంగా ఆక్రోశించాడు గంగులు.

ఓ పదహారేళ్ళ పిల్లాడ్ని చేతులమీద వేసుకుని బయటకు పోతున్న ఆ బెస్తవాణ్ణి చూస్తే ఎంతటి కఠినమైన గుండెనా కలుక్కుమనక మానదు ఒక్క డాక్టర్ కరుణాకర్‌కి తప్ప. నేతి బీరకాయలో నెయ్యి వంటిదే అతనిలోని కరుణ. పేరులో తప్ప మనిషిలో ఇసుమంతైనా కరుణలేని 'కొరడాకర్'.

బోలెడంత ఆస్తిపాసులు, ఇంకా లక్షలు వచ్చి చేరుతున్న అక్షయపాత్రలాంటి ప్రాక్టీసు. కాలాన్ని నిముషాలు, గంటలుగా కాకుండా వందలు, వేలతో లెక్కలు వేసే ఒక ప్రముఖ కార్డియాలజిస్టు. అతని దృష్టిలో పేదవాడు బ్రతకడానికే అనర్హుడు. లోకానికి అసలు అవసరం లేనివాడు.

అటువంటి కరుణాకర్ కొన్ని గంటలు తన సంపాదన ప్రక్కకుపెట్టి తప్పనిసరి పరిస్థితుల్లో ఢిల్లీనుండి మెడికల్ కాన్ఫరెన్స్‌కు వచ్చిన ప్రఖ్యాత సర్జన్ వివేక్‌ను రిసీవ్ చేసుకుని భీమిలీ అందాలను, సముద్ర చందాలను చూపించడానికి తీసుకెళ్లడం నిజంగా దైవఘటనే.

• • •

''డాక్టర్ వివేక్! ప్లీజ్ వద్దు. అటు లోతు ఎక్కువంటారు. అటువైపు పోవద్దు'' కంగారుగా అన్నాడు డాక్టర్ కరుణాకర్.

''ఏం ఫర్వాలేదు కరుణ్. నాకు స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడలుంది. అయినా మనం మన బిజీ లైఫ్‌లో ఎన్ని అందాలు, ఎంత ఆనందం మిస్ చేసుకుంటున్నామో చూడు'' పరవశంగా సముద్రంలోని అలలను చూస్తూ అన్నాడు డాక్టర్ వివేక్. ''ఈ సముద్రాన్ని చూస్తుంటే ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోంది. ఈ ప్రశాంతత, ఈ అందమైన వాతావరణం మా ఢిల్లీలో ఊహించడానికి కూడా అందదు. అబ్బ...కరుణ్ మరీ అంత భయమైతే ఎలా? రండి ఏం కాదు.''

''వద్దులెండి. అసలే నాకు హైడ్రోఫోబియా వుంది'' భయంగా అన్నాడు కరుణాకర్. 'అబ్బ...ఈ పిచ్చాడు ఎక్కడ దొరికాడురా బాబూ...సముద్రమనుకుంటున్నాడో మజాకనో. ఈ రోజంతా వేస్టే. ఏదో కాస్త పెద్దవాళ్లతో పరిచయం వుంటే మంచిదికదాని ఈయనతో బయలుదేరితే ఛ...అనవసరంగా ఎకాంపనీ అయ్యాను. కారిచ్చి ఏ రాజునో పంపవలసింది?' అనుకున్నాడు కరుణాకర్.

ఆలోచనల్లో వున్న డాక్టర్ కరుణాకర్‌ను ఓ పెద్ద అల బలంగా తాకడం, కెరటంతోపాటు కొట్టుకుపోవడం కళ్ళు మూసి తెరిచేటంతలో జరిగిపోయింది.


''ఓరి...గంగులూ ఆ అయ్య ఎవరో కొట్టుకుపోతుండాడు సూడు...ఓరి...ఓరి అట్టా పోమాకయ్యా. అల పెద్దగొచ్చేస్తోంది. జాగ్రత్తరోయ్...''

''కరుణ్..కరుణ్ ఎంత పని జరిగింది? అతను భయపడినదంతా జరిగింది. ఆయన కంగారుపడుతుంటే నేనే అనవసరంగా లోపలకు రమ్మన్నా. నేను కాస్త ముందుకు వెళ్లినంతలో ఈ ప్రమాదం జరిగింది. ఎలా? అయ్యా! కాస్తంత సహాయం చేయండి. మీవాళ్ళెవరైనా కొంచెం సముద్రంలోకి పోయి వెదకండి ప్లీజ్'' వేడుకుంటూ అన్నాడు డాక్టర్ వివేక్.

''మీరు మరీ కంగారు పడమాకండయ్యా. మా గంగులు దిగిండు. ఆడు సముద్రంలో దిగినాడంటే చిన్న సూదయినా తీసుకు రాగలడు. ఇంతకూ తమరెవరు బాబూ ఈ ఊరికి కొత్తల్లే వున్నారు. ఇది సానా పెమాదకరమైన సోటు బాబూ. మాలాటి బెస్తలే ఈడ దిగడానికి జంకుతారు. తమరు ఈడకెందుకు వచ్చారయ్యా?''

''ఛ..ఛ ఆయన చెబుతూనే వున్నాడు పాపం. నేనే చాలా ఫూలిష్‌గా బిహేవ్ చేసాను. ఈ డాక్టర్‌ను సముద్రానికి అప్పగించడానికే వచ్చినట్టున్నాను'' స్వగతంలా అన్నాడు.

''ఏటి బాబు తమరు డాక్టర్లా? ఏడనుంచి వచ్చినారు బాబూ?''



''నేను ఢిల్లీనుండి వచ్చాను. ఆయన మీ విశాఖ వాడే. డాక్టర్ కరుణాకర్ అని... చాలా పెద్ద కార్డియాలజిస్ట్.''

''ఏంటి ఆయన కరుణాకర్ బాబా? అలాంటి కసాయివాడి కోసమా మా గంగులు పేనాలొడ్డి సముద్రంలోకి దిగాడు. ఒరేయ్ గంగులూ... వచ్చేయ్. ఎనక్కి వచ్చేయ్. ఆడు పానాలతో ఇంకా వుంటే ఆణ్ణి ముంచేసి మరీ వచ్చేయ్. పీడాపోద్ది. నీ బిడ్డను చంపేసిన ఆ కసాయివాడిని నువ్వు రక్షించమాక. వచ్చెయ్యేహే.''

''అరె...మీరందరూ ఎందుకలా ఆవేశపడుతున్నారు? అసలు ఆ డాక్టర్ మీకు తెలుసా?'' అన్నాడు ఏమీ అర్ధంకాని డాక్టర్ వివేక్ కంగారుపడుతూ.

''ఆడు తెలియకపోవడమేమిటి దొరా? అసలు ఆడితోపాటు వచ్చావంటే ధూ...నువ్వు దొరేంది, నిన్ను గౌరవించడమేంది? నువ్వు కూడా అలాంటి కసాయివాడివే అయ్యుంటావు. నిన్నూ, నీలాంటి నీ డబ్బున్న వాళ్ళందరినీ కట్టకట్టి సముద్రంలో ఇసిరిపారెయ్యాల...నాయాల్ది.''

''ఓరి సిమ్మాచలం ఏటా ఆవేశం? ఆ బాబేదో చేస్తే మధ్యన ఈయనేం చేసాడు?''

''అడుగడుగో గంగులు ఆ అయ్యను భుజాన్నేసుకుని వస్తుండు. సాయం పడదాం పదహే.''

''ధూ... నీయవ్వ. ఆడ్ని అట్టానే సముద్రంలోకి విసిరెయ్యరోయ్. సముద్రంలో చేపలు కూడా పీక్కుతినవు వీడిని. అట్టాటోడు బతకడం భూమికి బరువురోయ్.''

''ఇక్కడ... ఇలా పడుకోబెట్టండి. మై గుడ్‌నెస్. హి ఈజ్ ఎలైవ్. నీళ్ళు బాగా తాగాడు. స్పృహ పోయిందంటే'' ఆనందంగా అన్నాడు డాక్టర్ వివేక్.

''ఆ... సూడు బాబూ నీళ్ళు కక్కించేశా. ఒరేయ్ ఓబులేసూ కాసిన్ని మంచినీళ్ళు తేరా.''

''ఓరి గంగులూ! ఆడెవడనుకుంటున్నావ్? నీ బిడ్డను పొట్టను పెట్టుకున్న పెద్ద కసాయి డాక్టర్ బాబు. ఓపాలి సూడయ్యా, నా బిడ్డని బతికించండయ్యా అని కాళ్ళు పట్టుకుని ఏడిచావే ఆడే ఈ పెద్ద డాక్టరుబాబు. డబ్బులిత్తేగానీ సావుబతుకుల మధ్యనున్న నీ బిడ్డ ముఖం కూడా సూడనన్నాడే. ఆ కరుణాకరం బాబే ఈడు. ఇప్పుడు నువ్వుపోయి ఆ బాబు గొంతులో నీళ్ళు... నాయాల్ని ఇసిరి పారెయ్యి సముద్రంలోకి'' ఛీత్కారంగా అన్నాడు సిమ్మాచలం.

''ఓరి సిమ్మచలం మావా. ఇప్పుడయన్నీ ఎందుకు? ఆడికి భూమ్మీద నూకలు చెల్లిపోయాయి. ఆడుపోయాడు. అది నా కర్మ. దానికి ఈ బాబునెందుకు తిట్టుకోవడం. ఉండు నే బేగెల్లి నీళ్ళు తెత్తాను.''

• • •

''దాహం...దాహం...''

''ఇదిగో నీళ్ళు. నోరు తెరవండి. ఆ మెల్లగా... మెల్లగా తాగండి. ఇప్పుడెలా వుంది? బాగా స్పృహకొచ్చారా? ఇదిగో వీళ్ళే... ఈ బెస్తవాళ్ళే ఈ రోజు నీ ప్రాణాలు కాపాడారు.''

''వద్దు బాబు వద్దు. ఆ బాబు దాహం ఈ మంచి నీళ్ళతో తీరదు. మాబోటి పేదోళ్ళ పాణాలతో తీరుద్ది. బాబూ... పసోడని కూడా చూడకుండా ఈ బాబే... ఈ బాబే మా సన్నాసిని... ఈ గంగులు కొడుకుని సంపేసినాడు బాబూ. ఉన్నపళాన పైసలు కడితేనే ఆడికేసి సూత్తానన్నాడు బాబూ. ఆ పసోడికి పదహారేళ్ళకే నూరేళ్ళు నిండిపోనానికి ఈ బాబు సలవే బాబూ'' ఆవేదనతో అన్నాడు ఓబులేసు.

''ఓబులేసు మామా! ఊరుకో. ఒకర్నని లాబమేమిటి? ఆడికి తీరిపోయింది. ఆడు ఎల్లిపోయాడు. నువ్వు ఊరికే గోల చెయ్యమాక. అసలే ఈ బాబు బాగా బెదిరిపోయాడు.''

''కానీ ఒక్కటి బాబూ. నీకాడున్న లచ్చలు ఈయాల నీ పానాలు నిలబెట్టలేదు బాబూ. ఈ పేదోడి సాయమే నీ పానాలు కాపాడింది బాబూ. సముద్రంలాంటి నీ సంపద నీ దాహం తీర్చలేదు బాబూ. పేదోడి మంచితనం అనే గుక్కెడు మంచి నీళ్ళు బాబూ నీ దాహం తీర్చి నీ పానాలు కాపాడింది. బాబూ! మేము పేదోల్లం. సదువుసందెలు లేని సన్నాసులం. కానీ పానం అందరికీ ఒకటే అని నమ్మినోల్లం బాబూ. అందుకే నువ్వెవరన్నది తెలీక పోయినా నా పానాలు అడ్డేసి కాపాడాను బాబూ. సదువూ, తెలివి అన్నీ వున్నోళ్ళు, కొంచెం మంచితనం, మానవత్వమే బాబూ మనల్నీ, మన మనసుల్నీ పెద్దది చేసేది.''

వివరాలు పూర్తిగా తెలియకపోయినా విషయం అర్థమైంది డాక్టర్ వివేక్‌కు.

''డాక్టర్ కరుణ్! అందరికన్నా, అన్నిటికన్నా ఎంతో ఉత్తమమైనది మన వృత్తి. మానవ సేవే మాధవ సేవ అన్న నానుడి ఊరికే రాలేదు కరుణ్. ప్రాణం పోసిన బ్రహ్మ ఎంత గొప్పవాడో ఆ ప్రాణం కాపాడి పునర్జన్మ ఇచ్చే డాక్టర్ అంతకంటే గొప్పవాడు. అలాంటి గొప్ప అవకాశం మనకి వుండి దానిని వినియోగించుకోలేకపోతే మనం ఎడారిలో ఒయాసిస్సులాంటి వాళ్ళమే డాక్టర్ కరుణాకర్. నీలాంటి తెలివైన డాక్టర్‌కు ఇంతకంటే విపులంగా చెప్పక్కర్లేదనుకుంటాను. ఏమైనా నీకిది పునర్జన్మ. ఈ బెస్తలే నీకు పునర్జన్మ ఇచ్చిన దేవుళ్ళు. ఈ జన్మను మీరు సార్థకం చేస్తారనే భావిస్తాను. రండి. వెళదాం'' అన్నాడు డాక్టర్ వివేక్.

★

## విడాకుల వివరాలు

భార్యాభర్తలు ఒకరికొకరు నచ్చకపోతేనో, గొడవలు పడితేనో తీసుకునే ఈ విడాకులు ప్రపంచంలోనే రికార్డు సృష్టిస్తున్నాయి. అమెరికాలో ఏటా 40 శాతం మంది ఈ విడాకుల పేరుతో దాంపత్య జీవితానికీ, కుటుంబ వాతావరణానికీ దూరంగా ఉంటున్నారు. 1870లో 10,962 మంది విడాకులు తీసుకుంటే, 1970లో 7 లక్షల 15వేల మంది, 1991లో 12 లక్షల మంది, 1999లో 16 లక్షల మంది... ఇలా విడాకుల సంఖ్య ప్రతి ఏడాదీ పెరుగుతోంది. ఈ విడాకుల వలన 17 లక్షల మంది చిన్నారులు అమ్మా, నాన్నలకి దూరం అవుతున్నారు. తైవాన్‌లో విడాకుల రేటు మరీ ఎక్కువ. జపాన్‌లో మాత్రం అతి తక్కువ. 1976లో వివాహ చట్టంలో మార్పులు వచ్చాక కాస్త విడాకుల కేసులు తగ్గాయి. ఢిల్లీలో ఏడాదికి 12 లక్షల మంది విడాకులు కోరుకుంటే, కేరళలో గత శతాబ్దంలో 35 శాతం పెరిగింది. చెన్నైలో ఏటా 15 శాతం విడాకుల కేసులు పెరుగుతున్నాయి. ప్రతి రెండు సెకండ్లకు ఓ విడాకుల కేసు నమోదవుతోంది. పిల్లలు మాత్రం 79.5 శాతం తల్లుల పాలనలోనే ఉండాలని తీర్పురాగా, 14.1 శాతం మాత్రం తండ్రుల పెంపకంలో వుండాలని కోర్టులు నిర్ధారిస్తున్నాయి. 3.8 శాతం పిల్లలు హాస్టల్స్‌లో ఉంటున్నారట.

ఏది ఏమైనా విడాకులనేవి తమలపాకులంత ఈజీ అయిపోయింది ఈ రోజుల్లో. విడాకులు తీసుకోవాలనుకునేవారు ఈ విషయాలను ఆలోచించి నిర్ణయం తీసుకుంటే మంచిదేమో!

-విరజ

